క్లుప్తంగా

చింతలమానెపల్లి తహసీల్దార్‌గా దౌలత్



బాధ్యతలు స్వీకరిస్తున్న మడావి దౌలత్

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల తహసీల్దార్‌గా మడావి దౌలత్ నియమితుల య్యారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రమేశ్ మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా చింతలమానెపల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దౌలత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు

కాగజ్‌నగర్‌టౌన్: 100 రోజుల పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని సర్‌సిల్క్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ బుధవారం తెలిపారు. కాలనీలో మురుగు కాలువల వెంబడి పేరుకుపోయిన పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించినట్లు తెలిపారు. కాలువల్లోని పూడికతీత పనులు చేపట్టామని, పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చేయించినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ మండల మహిళా కార్యవర్గం ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్‌ఎస్ మండల మహిళా కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పార్టీ మండల కన్వీనర్‌గా దుర్గం మమత, కోకన్వీనర్‌గా ఎలకటూరి సుజాత, ప్రధాన కార్యదర్శిగా మోర్లె పద్మ, కార్యదర్శులుగా దుర్గం సంగీత, చాటరే స్వప్న, జుమిడే అంజలిలను ఎన్నుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గ మహిళ కన్వీనర్ లలితా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన వారికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ బండు పటేల్, యూత్ అధ్యక్షులు కార్తీక్, నాయకులు నవీన్, సందీప్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయితీలో వీధి దీపాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.20వేలు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న సీడీ చౌహాన్

కెరమెరి: ఆగస్టు 9 నుంచి 19 వరకు నిర్వహించే మౌంట్ యూనమ్ సాహసయాత్రకు ఎంపికైన మండలంలోని కెలికే గ్రామానికి చెందిన మౌంటేనియర్ గిత్తే కార్తీక్‌కు సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ సీడీ చౌహాన్ బుధవారం రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు.

కుటుంబానికి చేయూత

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన చింతపురి కార్తీక్ అనే యువకుడు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి బోదంపల్లి యువకులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి వారు రూ. 10,200 అందించారు. గ్రామస్తులు నాగయ్య, రాజ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

దహెగాం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం ఏవో రామకృష్ణ తనిఖీలు నిర్వహించారు. ఆయన ఎరువులు, మందులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి

- గోయగాం పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం
- ఫలితమిచ్చిన బడిబాట



విరాళం అందజేస్తున్న ఎంఈవో (ఫైల్)



గోయగాం ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు

కెరమెరి: మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. గతేడాది వరకు 33 మంది విద్యార్థులు ఉండగా, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులు చేసిన కృషి ఫలించింది. నెలరోజుల్లోనే మరో 42 మంది చిన్నారులు పాఠశాలలో ప్రవేశం పొందారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో 75 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా మండలంలోని 85 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 342 మంది ఈ ఏడాది అడ్మిషన్లు తీసుకున్నారు. వారిలో 76 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నారు.

ప్రీప్రైమరీతో..

గోయగాంలో ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రీప్రైమరీ ప్రారంభించారు. దీంతో ప్రైవేట్ పాఠశాల నుంచి సర్కారు బడిలో 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ఇతర తరగతుల్లోనూ సంఖ్య పెరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు కొంతమంది యువకులు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సైతం ప్రోత్సాహం అందిస్తున్నారు. ఎంఈవో ఆడే ప్రకాశ్ రూ. 5000, సావర్‌ఖెడ హెచ్‌ఎం రంగయ్య రూ.5000, గోయగం పీఎస్ హెచ్‌ఎం రవితేజ రూ.24 వేలు, గ్రామస్తులు సుధాకర్ చిన్నారులకు బ్యాగులు, విజయ్ గుర్తింపు కార్డులు అందించగా, సునీల్ ప్రతీనెల 50 కిలోబియ్యం అందిస్తున్నారు.

విస్తృత ప్రచారం

బడిబాటలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవితేజతో పాటు ఉపాధ్యాయులు, యువకులు గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రతీ ఇంటికి తిరిగి విద్యార్థుల వివరాలు సేకరించారు. తన సొంత ఖర్చుతో కరపత్రాలు ముద్రించి ప్రచారం నిర్వహించారు.

విద్యార్థుల సంఖ్య పెరగాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించేందుకు కార్యాచరణ రూపొందించాం. ప్రైవేటు పాఠశాలల నుంచి అత్యధిక మంది విద్యార్థులను చేర్చుకోవాలని ఆదేశాలిచ్చాం. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులుంటే ప్రీప్రైమరీ ప్రారంభిస్తాం.

- ఆడే ప్రకాశ్, ఎంఈవో

ప్రైవేట్‌కు దీటుగా బోధన..



గతేడాది నుంచే ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతో ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంభించాలనుకున్నాం. బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేస్తున్నాం. గ్రామస్తులు, యువకులు ఎంతో సహకరమందిస్తున్నారు.

- రవితేజ, హెచ్‌ఎం

నమ్మకం పెరిగింది



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది. గతానికి ఇప్పటికి ఎంతో తేడా ఉంది. ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంభం కావడంతో ప్రైవేట్ పాఠశాల నుంచి ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో నా కూతురుకు 1వ తరగతి, కుమారుడికి ఎల్‌కేజీలో అడ్మిషన్ తీసుకున్న.

- నరిగే సురేశ్, పోషకుడు, గోయగాం

పింఛన్ కోసం తిప్పలు



ఈ ఫొటోలోని మహిళ పేరు తోట బుచ్చక్క. పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన ఈ మహిళ ప్రతినెలా పింఛన్ కోసం 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెజ్జూర్ మండల కేంద్రంలోని పోస్టాఫీసుకు వెళ్తుంటుంది. ఒకవేళ సిగ్నల్స్ సమస్య తలెత్తితే పోస్టాఫీసులో పింఛన్ ఇవ్వడం లేదు. దీంతో నిరాశతో వెనుదిరిగి మరుసటి రోజు మళ్లీ పింఛన్ కోసం బెజ్జూర్‌కు వెళ్తుంది. పింఛన్ తీసుకోవడానికి మండలంలోని చాలా మంది లబ్ధిదారులు ఇలా ఇబ్బందులు పడుతున్నారు.

- బెజ్జూర్ మండల కేంద్రంలో పంపిణీ
- పెంచికల్‌పేట్ వాసులకు దూరభారం
- సమస్య పరిష్కరించాలని లబ్ధిదారుల డిమాండ్

పెంచికల్‌పేట్: మండలంలోని కొంత మంది లబ్ధిదారులకు పింఛన్ తిప్పలు తప్పడం లేదు. లబ్ధిదారులు ప్రతినెలా ప్రభుత్వం అందించే పింఛన్ కోసం 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెజ్జూర్ మండల కేంద్రానికి అవస్థలు పడుతూ వెళ్తుంటారు. మండలంలోని మురళీగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, గుండెపల్లి, ఎల్లూర్, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, దరోగపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది లబ్ధిదారులు ప్రతినెలా పెన్షన్ కోసం ఇబ్బందులు పడుతున్నారు.



అవస్థలు పడుతూ..

మండలంలోని లబ్ధిదారుల్లో 20 మంది వృద్ధులు ఉన్నారు. వీరు ప్రతినెలా బెజ్జూర్‌లోని పోస్టాఫీసుకు పింఛన్ కోసం ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. పోస్టాఫీసులో సిగ్నల్ సమస్య తలెత్తితే రెండోరోజు సైతం మళ్లీ వాహనాల్లో వెళ్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌లో రాకపోకలకు సుమారు రూ. 500 వరకు ఖర్చు చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పింఛను కోసం ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నాం. దీంతో రాకపోకలకే ఖర్చులు అవుతున్నాయి. పెంచికల్‌పేట్‌లోనే పింఛన్ అందించాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. ఇప్పటికీ సమస్యను వారు పరిష్కరించలేదు. తమ సమస్య పరిష్కరించి పింఛన్‌ను పెంచికల్‌పేట్‌లో ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి.

- మిట్ట శంకర్, లబ్ధిదారుడు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని బలగల గ్రామంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల 2లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తల్లిపేరిట ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలకు వచ్చేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి ప్రిన్సిపాల్ తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, ఆర్‌ఎల్‌పీ పుష్పలత, డీఎండబ్ల్యూవో నదీమ్, ప్రిన్సిపాల్ గుప్తా, పంచాయతీ సెక్రటరీ హరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

రైతులకు యూరియా అందించాలి

కౌటాల: ఖరీఫ్ పంటల సాగు సమయంలో రైతులకు యూరియా బస్తాలు అందించాలని కోరుతూ బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక రైతు వేదికలో కౌటాల ఏఈవో ఘనశ్యాంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేని కారణంగా యూరియా కొరత ఏర్పడుతుందని ఆరోపించారు. సాగు పనుల సమయంలో యూరియా బస్తాల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగడం బాధకరమన్నారు. పార్టీ మండల అధ్యక్షులు నాగపూరే బండు, నాయకులు కార్తీక్, నవీన్, ఆనంద్, సందీప్, దివాకర్, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొరత లేకుండా చూడాలి..

రెబ్బెన: మండలంలో యూరియా కొరత సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

అధిక ధరలకు విక్రయం..

కెరమెరి: అధిక ధరలకు యూరియా, డీఏపీలను హకా నిర్వాహకులు విక్రయిస్తున్నారని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడవం లేదని పెసా మండల ఇన్‌చార్జి మడావి భరత్ భూషణ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. రైతులు ఎరువుల కోసం వెళ్తే స్టాక్ లేదని చెప్పడం, ఉన్న స్టాక్‌ను అధిక ధరలకు వ్యాపారులకు విక్రయించడం పరిపాటిగా మారిందన్నారు. బిల్లుల మీద ధర రాయకుండానే రశీదులు ఇస్తున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెసా మొబలైజర్లు ఆడ ఆనంద్ రావు, కుర్సెంగ యాదేశావ్, కుడ్మెత వెంకట్, ఆదివాసీ పెద్దలు మోతిరాం, తుకారాం ఉన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవి కుమార్, జిల్లా కార్యదర్శిగా దుర్గం గురువేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీడీలు మధుసూదన్, విద్యాసాగర్, సారంగపాణి, ఖేల్ ఇండియా కోచ్ రాకేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: సర్‌సిల్క్‌లో గల ఆర్‌బీ ఉర్దూ, బీఎంఎస్ కార్యాలయం సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో గోడలు శిథిలావస్థలో ఉన్నాయని, వర్షాలకు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. మూత్రశాలల డోర్లు విరిగిపోయాయని, తరగతి గది గోడ కూలిపోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇములేహక్, షేక్ ఫరీద్, హఫీజ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

వాంకిడి: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సొంత ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, నాయకులు అనిల్, జీవన్, నాగభూషణం, ధర్ము, బిల్ కలెక్టర్ గోవింద్, కారోబారి శంకర్ పాల్గొన్నారు.

'కళాశాలల బంద్ విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌రూరల్: 72 గంటలపాటు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. హరిచంద్ర, ప్రసాద్, అయ్యుబ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: పంచాయతీరాజ్ శాఖలో డీఈగా పని చేస్తున్న కృష్ణనాయక్ ఈఈగా పదోన్నతి పొందగా బుధవారం జిల్లాకేంద్రంలోని ఆయన కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులు పూర్తిగా గుంతలతో అస్తవ్యస్తంగా మారాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, నాయకులు బాల్దారావు మధుకర్, వైద్య వెంకన్న, రాథోడ్ వినోద్, బిజ్జు, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణనాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన



పెంచికల్‌పేట్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వరాదని సూచించారు. బ్యాంకు పేరుతో ఓటీపీలు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ లక్ష్మణ్, పీసీ రాజేశ్వర్, సమ్మక్క పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలోని సద్దంగూడ గ్రామంలో బుధవారం ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై గంగన్న మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

రెబ్బెన: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు కార్మిక వర్గమంతా ఐక్యంగా ఉండాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పత్తెం రాజాబాబు, మణిరాంసింగ్, ఎండీ చాంద్‌పాషాలు పిలుపునిచ్చారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరగూర ఓసీపీలో జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 9న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. హెచ్‌ఎంఎస్ ఏరియా కార్యదర్శి శివారెడ్డి, టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మేకల రవి, ఐఎఫ్‌టీయూ సెంట్రల్ నాయకులు శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: ఈ నెల 9న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో వీవోఏలు పాల్గొంటున్నట్లు వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు అనిషెట్టి రమేశ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్‌కు ఎంఎస్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా, బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వీవోఏలను సీసీలుగా ప్రమోట్ చేయాలని కోరారు. సీసీ సంజీవ్, నాయకులు రఘునాథ్ తదితరులు ఉన్నారు.



కెరమెరి: సమ్మె నోటీసు అందజేస్తున్న రమేశ్

స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

కాగజ్‌నగర్‌టౌన్: రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు త్రివేణి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెప్మా జిల్లా కోఆర్డినేటర్ మోతిరాంకు సమ్మె నోటీసు అందజేశారు. తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి స్వప్న, కోశాధికారి స్వర్ణలత, రమ్యశ్రీ, శైలజ, రిసోర్సపర్సన్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

దేవస్థానాల్లో సీనియర్ సివిల్ జడ్జి పూజలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని బుధవారం రాత్రి సీనియర్ సివిల్ జడ్జి యువరాజ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ సీనియర్ సివిల్ జడ్జికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పుంజుమేరగూడలో గల భూవమ్మతల్లి దేవస్థానాన్ని యువరాజ సందర్శించారు. మొహరం సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన పీరీలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు జడ్జిని శాలువాతో సన్మానించారు.



ఆలయంలో యువరాజ

'సీతక్కపై విమర్శలు చేస్తే సహించేది లేదు'

బెజ్జూర్: మంత్రి సీతక్కపై రావి శ్రీనివాస్ విమర్శలు చేస్తే సహించేది లేదని టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రావి శ్రీనివాస్‌ను ఆరేళ్ల పార్టీ నుంచి సస్పెండ్ చేసినా తన ప్రవర్తనలో మార్పు రావడం లేదన్నారు. సీతక్కకు రావి శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూస శంకర్, లింగయ్య, పెంటయ్య, తులసిరాం, నందయ్య, భూమయ్య, తిరుపతి, శ్రీహరి, షణ్ముఖ చారి, రంగయ్య, సల్మాన్ ఖాన్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్

'ప్రత్యేక మతం కాలమ్ కేటాయించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్రం నిర్వహించే జన, కుల గణనలో ఆదివాసీలకు ప్రత్యేక మతం కాలమ్ కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (ట్యాగ్స్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి, భాష, వైవిధ్య భరితమైన జీవన విధానం పరిగణలోకి తీసుకుని గెజిట్‌లో ప్రత్యేక మతంగా పొందుపర్చాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కోరెంగా మాలశ్రీ, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, మడావి గణపతి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సచిన్